# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- యోగా భారతదేశ వారసత్వమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కర్ణాటక ప్రభుత్వం ఈరోజు ఆరు కుంకీ ఏనుగులను అప్పగించింది.
- విశాఖ మెట్రో నిర్మాణ పనులు వచ్చే అక్టోబర్ లో ప్రారంభం కానున్నాయని మంత్రి పి.నారాయణ తెలిపారు.
- అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు.

====================

యోగా భారతదేశ వారసత్వమని.. మెరుగైన జీవనానికి అది దోహద పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు “యోగాంధ్ర” ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దీనికి సంబందించి యోగాంధ్ర వెబ్ సైట్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు ప్రపంచంలో అన్ని దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారన్నారు. యోగా అనేది కేవలం కొద్దిమందికే కాదని అందరి జీవితాల్లో యోగా ఒక భాగం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో కనీసం 2 కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా శిక్షణ ఇవ్వనున్నామని వెల్లడించారు. కొత్తగా 2 వేల 500 మంది అనుబవుజ్ఞులైన శిక్షకులను తీసుకొనున్నామని వెల్లడించారు. కాగా జూన్ 21న విశాఖపట్టణంలోని ఆర్కే బీచ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు.

====================

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కర్ణాటక ప్రభుత్వం ఈరోజు ఆరు కుంకీ ఏనుగులను అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ లోని పలు జిలాల్లో అడవి ఏనుగులు పంటపొలాలపై దాడులు చేసిన ఘటనలు గత కొంత కాలంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ దాడుల్లో కొంతమంది రైతులు కూడా మృతి చెందడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్నాటకలో ఇటువంటి సమస్యను

ఎదుర్కోవడంలో ఉపయోగపడిన కుంకీ ఏనుగులను ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపధ్యంలో ఈరోజు బెంగళూరులోని విధానసౌధలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ సమక్షంలో ఏనుగుల అప్పగింత కార్యక్రమం జరిగింది. కుంకీ ఏనుగుల సంరక్షణకు సంబంధించిన వివరాలను కూడా పవన్‌కల్యాణ్ కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ... ఎటువంటి సహాయం అడిగినా కర్ణాటక ప్రభుత్వం ముందుకొస్తోందన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

====================

విశాఖ మెట్రో నిర్మాణ పనులు వచ్చే అక్టోబర్ లో ప్రారంభం కానున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈరోజు విశాఖపట్టణంలో స్థానిక శాసన సభ్యులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విశాఖలో డబుల్ డెక్కర్ కి సంబందించిన సమగ్ర నివేదికలు సిద్ధమయ్యాయని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం అనుసందానానికి ప్రతిపాదించిన 22 రహదారుల్లో 16 పూర్తి అయ్యాయని వెల్లడించారు. విశాఖ నగరానికి సెమీ అవుటర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

====================

ఛత్తీస్గఢ్ నారాయణపుర్ జిల్లాలోని అబూజ్ మడ్‌లో ఈరోజు జరిగిన ఎన్ కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల కీలక నాయకుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా సామాజిక మాధ్యమం ఎక్స్ లో ప్రకటించారు. పీపుల్స్ వార్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నంబాల కేశవరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లాలోని జియ్యన్నపేట. తూర్పు గోదావరి, విశాఖ జిల్లాలలో మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ అగ్ర నాయకుడిగా కేశవరావు పని చేశారు. ఆయనపై కోటి యాభై లక్షల రూపాయల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు.

విరామం

====================

అమృత్ భారత్ పథకం కింద దేశంలోని పలు రైల్వే స్టేషన్ లు నూతన మెరుగులు దిద్దుకున్నాయి. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో పాటూ నూతన హంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఈ రైల్వే స్టేషన్ లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించనున్నారు. దేశంలోని చాలా స్టేషన్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తోన్న రైల్వే శాఖ ఆ జాబితాలో ఎంపికయిన తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ను ఇప్పటికే ఆధునీకరించి సిద్ధం చేసింది. హైటెక్ రిజర్వేషన్ కౌంటర్, అధునాతన సీటింగ్ సౌకర్యం, రెండు లిఫ్ట్ లు, నూతన ప్లాట్ ఫామ్ లతో పాటూ దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దుల్లో ఒక పట్టణంగా ఉన్న సూళ్లూరుపేటలో రైల్వే స్టేషన్ ను ఆధునీకరించడంతో రాకపోకలు పెరుగుతాయని వ్యాపారులు, ఉద్యోగులకు ఇది మేలు చేస్తుందని స్థానికుడు ధనుంజయ్ ఆకాశవాణితో మాట్లాడుతూ..

(వాయిస్ 26 సెకన్లు)

====================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పంలోని తిరుపతి ప్రసన్న గంగమ్మ ఆలయాన్ని ఈరోజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బెంగుళూరు విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయానికి వెళ్ళి అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా కుప్పం చేరుకుని తిరుపతి ప్రసన్న గంగమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుటుంబ సమేతంగా సారెను కూడా సమర్పించారు. అనంతరం బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

====================

విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించిన సన్నాహక వేడుకలు ఈరోజు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విశాఖ ఆర్.కె. బీచ్ వద్ద ఈరోజు ఉదయం యోగాంధ్ర పేరిట నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని వివిధ యోగాసనాలు వేయడంతో పాటూ కార్యక్రమ ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ... ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు యోగా చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతీఒక్కరూ యోగాపై పూర్తి అవగాహన పెంచుకొని దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు తమ సమీప ప్రాంతాల్లోనే యోగా నేర్చుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

====================

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులపైనా అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటూ క్షేత్ర స్థాయిలో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవనకళ్యాన్ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. “మన ఊరు-మాటా మంతి” పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని రేపు ఆయన దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించనున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని భవానీ థియేటర్ వెండితెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా రావివలస గ్రామానికి చెందిన 300 మందితో ముఖాముఖి నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.

====================

పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు మేఘావృతమైన వాతావరణంతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో చాలా చోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు.

====================
====================